క్లుప్తంగా

కమిటీల ఎన్నిక

భూపాలపల్లి రూరల్: సేవాలాల్ సేనా అర్బన్ మండల కమిటీలను జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు భూక్యా నరేష్ కమిటీల వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడిగా రాంసింగ్, మహిళ అధ్యక్షురాలిగా సుగుణ, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, యువజన అధ్యక్షుడిగా రఘుపాల్, భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా సందీప్, ఉపాధ్యక్షుడిగా చందు, రైతువిభాగం అధ్యక్షుడిగా వాల్యానాయక్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడిగా తిరుపతిని ఎన్నుకుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాలు నాయక్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకపోడు..



మహాముత్తారం: మండలకేంద్రంలో ఆదివారం ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షుడు గొట్ట భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల రామచంద్రం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామినేని వెంకటరాజం, ఉపాధ్యక్షుడిగా గందె లస్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల మల్లేష్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా బెల్లంకొండ బొందయ్య, కోశాధికారిగా ఒల్లాల సారయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు రమేశ్, రాకేష్, పీసీసీ మెంబర్ బెల్లంకొండ కిష్టయ్య, కౌన్సిలర్ బద్ది సమ్మయ్య, ఇనుముల సంతోష్, గాదె రవీందర్, బోద రాజు, బైరి కొమ్మయ్య, గుంటినాగరాజు, శంకర్,మల్లేష్, రాజబాపు, గొరికె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: మైనార్టీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాల కోసం దరఖాస్తులకు నేడు(సోమవారం) చివరి అవకాశం అని మున్సిపాలిటీ కోఆప్షన్‌మెంబర్ మహమ్మద్ ఇర్ఫాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ సేవాల్లో దరఖాస్తు చేసిన పత్రాలతో పాటు, ఆధార్‌కార్డు, ఓటర్‌ఐడికార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ సెట్లను సకాలంలో మున్సిపాలిటీ కార్యాలయంలో అందించాలన్నారు. జిల్లాలోని మైనార్టీలు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కోడెల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి చిన్న కుమారుడు నరేష్‌తో కలిసి 2005–06లో పదో తరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతల మహేందర్, మురహరి భానుచందర్, పాసిగంటి మహేందర్, చాంద్‌పాషా, కట్కూరి కుమార్, గుండ తిరుపతి, ఉయ్యాల రమేష్, రాజేష్, అనుప రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణ పరిధిలోని మంజూర్‌నగర్‌లో గుడుంబాను పట్టుకున్నట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు ఆదివారం మంజూర్‌నగర్‌లో గంట మదునయ్య, బోతుల రమా అనే ఇద్దరి ఇంటి పరిసరాల్లో దాడులు నిర్వహించి గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మదునయ్య వద్ద 14లీటర్లు, రమా వద్ద 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

చిట్యాల మండలం పాసిగడ్డతండాలో..

చిట్యాల: మండలంలోని పాసిగడ్డతండా గ్రామానికి చెందిన లావుడ్య రాజేందర్ అక్రమంగా గుడంబాను తరలిస్తుండగా ఆదివారం పట్టుకున్నట్లు ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అటుగా వెళ్తున్న వ్యక్తి అనుమానదస్పదంగా కనబడడంతో అతని వద్ద తనిఖీ చేయగా అతని సంచిలో 20 లీటర్ల గుడంబా దొరికినట్లు తెలిపారు. ఈ మేరకు గుడంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సురేందర్, సిద్దార్థ, లింగన్న పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన సమీపంలోని కల్వర్టును మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచకు చెందిన కారు అదుపు తప్పి ఆదివారం ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్పగాయాలైనట్లు తెలిసింది. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- నామమాత్రంగా సమావేశాలు



గాలివానకు ఎగిరిపోయిన పెద్దతూండ్ల క్లస్టర్ రైతువేదిక పైకప్పు

మల్హర్: రైతులను అందరిని ఒక్క దగ్గర చేర్చి వ్యవసాయంలో అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వారికి మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు లక్ష్యానికి దూరంగా ఉంటున్నాయి. దీంతో రైతు వేదికలు కొన్ని చోట్ల అలంకారప్రాయంగా మారుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించినా అనుకున్న లక్ష్యాలను చేరడంలో మాత్రం విఫలం అవుతున్నాయి. ఈ నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం పరిధిలో మొత్తం 15 గ్రామపంచాయతీలు ఉండగా వాటిని నాలుగు క్లస్టర్‌గా విభజించి ఒక్కొక్క వేదిక రూ.22లక్షల వ్యయంతో తాడిచర్ల, కొయ్యూరు, రుద్రారం, పెద్దతూండ్ల రైతు వేదికలను నిర్మించారు. వీటిలో తాడిచర్ల రైతు వేదిక భవనం అసంపూర్తిగా ఉంది. పైకప్పు నిర్మించి ఫ్లోరింగ్ చేయకుండానే వదిలివేశారు. అలాగే మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ పాఠశాల సమీపంలో పెద్దతూండ్ల రైతు వేదిక నిర్మించారు. ఈ వేదిక నిర్మించిన కొద్ది కాలానికే గాలివానకు షెడ్‌పై ఉన్న రేకులు మొత్తం ఎగిరిపోయాయి. ఈ రెండు వేదికల వైపు చూసిన వారే కరువయ్యారు. ఏదో తమ పని తాము పూర్తి చేసినట్లు అధికారులు సైతం వేదికలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మిగతా రెండు వేదికల్లో అడపాదడపా పలు కార్యక్రమాలకు వినియోగించి, తాళాలతోనే వేస్తున్నారు. ఇప్పటికైనా రైతు వేదికలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీస్కుకోవాలని రైతులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న తాడిచర్ల రైతువేదిక

ప్రజాధనం వృథా



లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రైతు వేదికలు ఎక్కడ కూడా రైతులకు ఉపయోగపడింది లేదు. దీంతో ప్రజాధనం వృథా అవుతుంది. ఒక్క సమావేశం కూడా నిర్వహించకుండా ఎప్పుడు చూసిన తాళాలతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా రైతు వేదికలు రైతులకు ఉపయోగపడేలా అధికారులు చర్య తీసుకోవాలి.

కట్కం మధుసూదన్,
రిటైర్డ్ పోస్టుమాస్టర్, తాడిచర్ల, మల్హర్

రైతు వేదికల లక్ష్యాలు..

- పంటసాగుకు అవసరమైన అధునాతన పరిజ్ఞానం అందించి పంట ఉత్పాదకత పెంచడం.
- పంట రుణాలు, రాయితీలు సక్రమంగా అందేలా చూడటం.
- రైతు సమన్వయ సమితి సమావేశాలు ఏర్పాటు చేయడం.
- వానాకాలం, యాసంగి సీజన్‌లో వేసే పంటలపై సూచనలు అందించడం.
- పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలపడం
- ఎరువుల వాడకంపై అవగాహన కల్పించడం.
- భూసార పరీక్షలు నిర్వహించి వాటిని వెల్లడించడం

‘జెడ్పీ చైర్‌పర్సన్‌ను కించపరచడం సరికాదు’

కాటారం: దళితురాలైన జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిని సరైన ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు వివక్ష చూపుతూ కించపర్చడం పద్ధతి కాదని మాలమహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు చకినాల ప్రశాంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుజనులు అధికంగా ఉన్న ఈ జిల్లాలో ఓ దళితురాలైన ప్రజాప్రతినిధికే సరైన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా పలువురు అధికారులు ఇదే విధంగా వ్యవహరించారన్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం అయితే మాలమహానాడు పక్షాన ఆందోళన చేపడుతామని ప్రశాంత్ హెచ్చరించారు.

గీతా ముఖర్జీ జీవితం ఆదర్శనీయం

భూపాలపల్లి అర్బన్: గీతా ముఖర్జీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ తెలిపారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం రావి నారయణరెడ్డి భవనంలో గీతా ముఖర్జీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ.. గీతా ముఖర్జీ సామాజిక కార్యకర్తగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి మహిళలను ప్రోత్సహించారన్నారు. రాజకీయంగా కూడా ఎంతో రాణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మోట పలుకుల సుజాత, నాయకులు అనిత, కంచ ఐలమ్మ, అన్నం రామ్ అక్క, వెంకటమ్మ పాల్గొన్నారు.

త్వరలో దిశ సెంటర్ ఏర్పాటు



మాట్లాడుతున్న నారాయణబాబు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో త్వరలో దిశ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రగతి భవనంలో ఆదివారం జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు దిశ ప్రాజెక్టుపై లీగల్ అవేర్‌నెస్ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 సంవత్సరాలలోపు ఉన్న దివ్యాంగులు, ఈ ప్రాజెక్ట్‌లో ఉండే వారి గురించి, లబ్ధి పథకాల గురించి, మహిళలకు చట్టాల్లో ఉన్న హక్కుల గురించి వివరించారు. కొత్త జిల్లాలో భూపాలపల్లిలో దిశ ఏర్పాటుకు గుర్తింపు ఇచ్చారని తెలిపారు. త్వరలో దిశ సెంటర్లను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, కమిటీ సభ్యులు రాంచందర్ రావు, డీఎస్పీ రాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, న్యాయవాదులు వెంకటస్వామి, రాకేష్, అనిల్, విష్ణు, విష్ణు వర్ధన్ రావు, ప్రియాంక పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

మహాముత్తారం: గ్రామాల్లో అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై రమేశ్ అన్నారు. మండలంలోని కోనంపేటలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామ ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదే విధంగా గ్రామంలో పేకాట, కోడిపందాలు నిర్వహించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై వెంట సీఆర్‌పిఎఫ్ సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

మండల కేంద్రంలోని కోనంపేట వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి వద్ద ఎస్సై రమేశ్, సీఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మంజూల సంయుక్తంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహన పత్రాలను పరిశీలించి అనుమానితులను విచారించి వదిలేశారు.



వాహన పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి



టేకుమట్ల(రేగొండ): పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గంగాధరి రాజు, అముదాలపల్లికి చెందిన ఓదేలు, కొడేల మల్లయ్య, అల్లం ఎంకులు, బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అలువాల రాజవీరు, తోట రమణయ్య, చల్లగరిగ గ్రామానికి చెందిన కర్రె నర్సింహారెడ్డి, మేకల రాజయ్య, తోనగర్ నరసింగం, బామర్ రంగుబాయ్, జూకల్ గ్రామానికి చెందిన చిదిరాల రాజయ్యలు అనారోగ్యాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదివారం పరామర్శించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శులు ఎరుకోండ రాజేందర్, రవీందర్‌రావు, నాయకులు కర్రె అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గుర్రపు తిరుపతి, కట్కూరి రాజేందర్, అల్లం రవీందర్, నాగరాజు, శ్రీనివాస్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ తిరుమలగిరి గ్రామానికి చెందిన శ్రీపతి చంద్రమౌళి, గోరికొత్తపల్లికి చెందిన రాజయ్య, రామగుండాలపల్లికి చెందిన రమేష్, నిజాంపల్లికి చెందిన బొమ్మకంటి బక్కయ్య ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎస్ఎస్ తాడ్వాయి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి మండల ఇన్‌చార్జ్ పి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆమె హాజరై మాట్లాడారు. మండలంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా పోగు రాజేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జాతర మాజీ చైర్మన్ కొర్నెబెల్లి శివయ్య, మాజీ మండల అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగజ్యోతి

మల్లంపల్లిని మండలం చేయాలి



నిరసన తెలుపుతున్న సాధన సమితి నాయకులు

ములుగు రూరల్: అన్ని అర్హతలు ఉన్న మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు అన్నారు. మండల పరిధిలోని మల్లంపల్లిలో ఆదివారం సాధన సమితి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేస్తున్నా మల్లంపల్లి మండల ఏర్పాటుపై స్పందించకపోవడం దారుణమన్నారు. మండల ఏర్పాటుపై నిరసనలు తెలుపుతున్న సాధన సమితి నాయకుల నోర్లు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు తప్పా ప్రజల ఆకాంక్షను నెరవేర్చే ప్రయత్నం చేయడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు వెంటనే రాజీనామాలు చేసి ప్రజల ఆకాంక్షకు కట్టుబడి పని చేయాలన్నారు. లేని పక్షంలో స్థానిక అధికార పార్టీ నాయకులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కానుగంటి సతీష్, రవి, అనిల్, సంపత్, రాము, ప్రభాకర్, మహేందర్, నాగరాజు, శ్రీను, కోటి, శ్యామ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ఏటూరునాగారం : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పాటుపడుతున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ములుగు ఎమ్మెల్యే సీతక్క తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో తొలుత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న జన్మదిన నేపథ్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీతక్క మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తాను పని చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమాన్ని విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఈ క్రమంలో విసిగిన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో కన్నాయిగూడెం జెడ్పీటీసీ నామా కరంచంద్ గాంధీ, టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, ఎస్టీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సోమయ్య ఉన్నారు.

కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలి



భూపాలపల్లి రూరల్: సమావేశంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజలతో మమేకం కావాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐయిత ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన హాత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా, మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి ఇంటిని తడుతూ.. పార్టీ విధివిధానాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చల్లూరి మధు, నాయకులు దేవన్, పుప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

సత్యనారాయణను కలిసిన నాయకులు

చిట్యాల: మండలంలోని గుంటురూపల్లికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావును హన్మకొండలోని అతడి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మక్కెన కార్తీక్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముద్దన నాగరాజు, నాయకులు శివరామకృష్ణ, హన్మంతరావు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, సతీష్, సురేష్, భగవాన్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రతిభ విద్యా మందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2008–09 పదవ తరగతి విద్యార్థులు ప్రతిభ విద్యా మందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం పాఠశాల ఆవరణంలో చేసుకున్నారు. ప్రతిభా విద్యా మందిర్ స్కూల్ వ్యవస్థాపకుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, ప్రిన్సిపాల్ పోశయ్య, ఉపాధ్యాయులు హనుమంతరావు, బుర్ర సునీత కృష్ణమోహన్, ఉమారాణి, పుష్పలత, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కేసీఆర్



మాట్లాడుతున్న లింగారావు

మొగుళ్లపల్లి: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినట్లు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలునేని లింగారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంతి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఎలాంటి పదవి లేకున్నా ప్రజల కష్టాలను తెలుసుకుని పోరాటం చేస్తున్న నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం సరైంది కాదన్నారు. మండలంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎమ్మెల్యే, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండ రవి, క్యాతరాజు రమేష్, ఒనపాకల ప్రసాద్, రాజు, రఫీ, రాము, దేవేందర్, పరశురాములు, నర్సింగరావు, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోతుల నుంచి ప్రజలను కాపాడాలి

భూపాలపల్లి రూరల్: పట్టణంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వాటి నుంచి పట్టణ వాసులను రక్షించించే విధంగా మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని బీజేపీ అర్బన్ ఉపాధ్యక్షుడు కొరె సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోతులు ఇళ్లలో చొరబడి వస్తువులను ఎత్తుకు పోతున్నాయని, ప్రజలను గాయాల పాలు చేస్తున్నాయన్నారు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న జగదీశ్

ములుగు రూరల్ : మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అన్నారు. మండలంలోని మల్లంపల్లి జెడ్పీ హై స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఆదివారం తనిఖీ చేసి మాట్లాడారు. స్టోర్ రూం, అదనపు తరగతి గదులను, ప్రహరీ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాల పేరుతో పాటు తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నేరెళ్ల గోపి, ఎంపీటీసీ ప్రభాకర్, రమేష్, సంతోష్, మొగిలి పాల్గొన్నారు.